RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:61 | ఫిబ్రవరి 10, 2026 | వెల: రూ.3-00

## సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు



2లో

- గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నేతలు
- టికెట్ దక్కించుకోవడం నుంచి పోలింగ్ వరకు డబ్బే డబ్బు..
- చైర్మన్ అభ్యర్థులపై కోట్లలోనే ఖర్చు
- పెద్ద మున్సిపాలిటీలైతే మరింత భారం
- ఈసారి ఎన్నికల్లో షాడోలుగా రియల్టర్లు, బడా బాబులు
- కార్పొరేషన్లపైనే పార్టీల ప్రధాన గురి

పోల్ మేనేజ్మెంట్ కోసం రంగంలోకి టీంలు

- భారీగా డబ్బు పంచేందుకు సిద్ధం


అందరితోనూ 'మీకే మా ఓటు' అంటున్న ఓటర్లు

# ఎంతైనా పంచుతాం!

మున్సిపాలిటీ ఎన్నికల్లో నోట్ల వరద

కోట్లు ఖర్చు చేస్తున్న అభ్యర్థులు

2లో




**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ గడ్డపై మున్సిపల్ ఎన్నికల వేడి పరాకాష్టకు చేరింది. మెజారిటీ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో గెలుపు జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు వ్యూహప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి. అయితే, ఈసారి ఎన్నికల్లో పార్టీల సిద్ధాంతాల కంటే డబ్బు డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా మారింది. వార్డు స్థాయి నుంచి కార్పొరేషన్ మేయర్ పీఠం దాకా అభ్యర్థులు కోట్లాది రూపాయలు నీళ్లలా ఖర్చు చేస్తూ, ఎన్నికలను ఒక భారీ బిజినెస్ డీల్ గా మార్చేస్తున్నారు. ఒకప్పుడు కేవలం అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకే పరిమితమైన కోట్ల ఖర్చు.. ఇప్పుడు వార్డు మెంబర్ స్థాయికి పాకడం సామాన్యులను విస్మయానికి గురిచేస్తోంది. టికెట్ సాధించడం కోసం అధిష్టానానికి సమర్పించుకోవడం దగ్గరి నుంచి మొదలైన ఈ ధనయజ్ఞం.. నామినేషన్ల ఉపసంహరణలో రెబల్స్ నోరు నొక్కడం, ప్రచారంలో మందు, మాంసం ఏరులై పారించడం, చివరికి పోలింగ్ ముందు ఓటుకు నోటు పంపిణీ చేయడం దాకా.. ప్రతి అడుగులోనూ నోట్ల కట్టలు రెక్కలు కట్టుకుని ఎగిరిపోతున్నాయి. ఖర్చు పెట్టే సత్తా ఉన్న వారికే పార్టీలు ఎర్రటి తివాచీ పరుస్తుండటంతో.. సామాన్య కార్యకర్తలు పక్కకు తప్పుకోక తప్పని పరిస్థితి నెలకొంది. కొన్ని టఫ్ ఫైట్ ఇచ్చే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అభ్యర్థులు గెలవడమే లక్ష్యంగా 'ఎంతైనా పంచుతాం.. ఏమైనా చేస్తాం' అనే తెగింపుతో కనిపిస్తున్నారు.




## 'అంగన్‌వాడీ'ల బాధ్యత ఇక సర్పంచులదే..

- పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం
- అక్రమాలకు చెక్ పెట్టేందుకే నిర్ణయం

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణలో గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అధికారాలు అప్పగించింది. ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను పూర్తిగా సర్పంచ్‌లే నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పౌష్టికాహార పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టి, అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం

మిగతా 2వ పేజీలో..

## మున్సిపల్ ఎన్నికల్లో ప్రలోభాల యత్నం

- గజ్వేల్, సిరిసిల్లలో భారీగా మద్యం పట్టివేత
- అభ్యర్థుల ఇళ్లలో నిత్యావసరాలు సీజ్

2లో

## ప్రతి ఒక్కరి లెక్క తేలుస్తా..

చందాలు, దందాలు చేస్తే కింద పడుద్ది జాగ్రత్త



- కారుకూతలు కూస్తే బొక్కలోకి పంపడం ఖాయం
- ఏప్రిల్‌లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- అధికారంలో లేని మీరు ఎలా అభివృద్ధి చేస్తారు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఏదులాపురంలో ఎన్నికల ప్రచార ముగింపు సభ

2లో



## రేవంత్ లాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు

- దిగజారిన మాటలు మాట్లాడుతున్నాడు
- కేసీఆర్‌పై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు
- హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం
- మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ ఫైర్

**వేద న్యూస్, భూపాలపల్లి**

అన్న ఎన్టీఆర్, ఆ తర్వాత చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్‌లను చూశామని, కానీ ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంటి సీఎంను మాత్రం తాము ఎప్పుడూ చూడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. హామీల గురించి ప్రశ్నిస్తే అభ్యంతరకరమైన,

మిగతా 2వ పేజీలో..

## నిజామాబాద్‌లో కాంగ్రెస్ మేయర్ అవసరం

- అప్పుడే అభివృద్ధి సాధ్యం
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- బీజేపీ ఎంపీ అరవింద్‌పై తీవ్ర విమర్శలు



2లో

వేద న్యూస్
మంగళవారం | ఫిబ్రవరి 10, 2026

## రేవంత్ లాంటి సీఎంను
# ఎప్పుడూ చూడలేదు

... మొదటి పేజీ తరువాయి

దిగజారిన వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ఇంతమంది ముఖ్యమంత్రులను ప్రజలు చూశారని, కానీ ఎవ్వరూ ఇలాంటి భాషను ఉపయోగించలేదని అన్నారు. భూపాలపల్లి, పరకాల ప్రాంతాల్లో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభల్లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అసలు జిల్లాను ఆయన సృష్టించాడా? రద్దు చేయడానికి హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. జిల్లా రద్దు చేస్తే భూపాలపల్లి ప్రజలు ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను తిడితే ఊరుకునేది లేదని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ హెచ్చరించారు. తనను లేదా ఇతర నాయకులను విమర్శిస్తే పరవాలేదని, కానీ కేసీఆర్‌ను, బీఆర్ఎస్ కార్యకర్తలను తిడితే మాత్రం సహించబోమని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అధికార కాలం రెండేళ్లేనని, ఆ తర్వాత గులాబీ జెండా మళ్లీ ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంతమంది దేవుళ్లను మొక్కుకున్నా అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టేది లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలు పాలన పక్కనపెట్టి కుంభకోణాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పనీ చేయలేదని విమర్శించారు. సింగరేణిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన బావమరిది కలిసి దోచుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రజలను ఆ పార్టీ నాయకులే ముంచుతారని హెచ్చరించారు. రూ.4 వేల పెన్షన్, తులం బంగారం, రైతుబంధు పెంపు వంటి హామీల్లో ఒక్కటైనా అమలు కాలేదని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తేనే హామీలు అమలయ్యే పరిస్థితి వస్తుందని ఓటర్లకు పిలుపునిచ్చారు.

## 'అంగన్‌వాడీ'ల బాధ్యత
# ఇక సర్పంచులదే..

...మొదటి పేజీ తరువాయి

తీసుకున్నారు. గ్రామాల్లో గత రెండేళ్లుగా ఎన్నికైన పాలకవర్గాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ పూర్తిగా బలహీనపడిందని ప్రభుత్వం గుర్తించింది. పలుచోట్ల పౌష్టికాహారం పక్కదారి పడుతున్నట్లు నివేదికలు రావడంతో, ఇటీవల ఎన్నికైన కొత్త పంచాయతీ పాలకవర్గాలకు ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామ పంచాయతీలో సర్పంచ్‌ను ఛైర్మన్‌గా నియమిస్తూ 11 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నారు. అంగన్‌వాడీ టీచర్ కన్వీనర్‌గా, ఏఎన్ఎం, స్కూల్ సైన్స్ టీచర్, ఒక రిటైర్డ్ ఉద్యోగి, చిన్నారుల తల్లులు కమిటీ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రాలకు అందుతున్న బియ్యం, పప్పు, బాలామృతం, గుడ్లు, పాలు వంటి పౌష్టికాహార సరుకుల నాణ్యత, పంపిణీని తనిఖీ చేస్తుంది. అలాగే ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న భోజనాన్ని కూడా పరిశీలించనుంది. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం కేటాయిస్తున్న లక్షల రూపాయల విలువైన పోషకాహారం లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడటమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం స్పష్టం చేసింది.

## సీఎం రేవంత్ రెడ్డిపై
# చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు
- ప్రభుత్వ సభల్లో కాంగ్రెస్ ప్రచారం ఆరోపణ
- ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై చర్యల డిమాండ్
- రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించిన బీఆర్ఎస్ నేతలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటు చేసిన సభల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆరోపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో సీఎం ఇలా వ్యవహరించడం తీవ్ర ఉల్లంఘనగా బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్ రెడ్డి, బొమ్మెర రామమూర్తి, డా. కురువ విజయ్ కుమార్, కార్తీక్ రాయల, ఫయాజ్ కలిసి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘంను ఆశ్రయించారు. ప్రభుత్వ కార్యక్రమాల పేరుతో నిర్వహించిన సభలను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార వేదికలుగా మార్చారని, ఇది ప్రజాధన దుర్వినియోగానికి సమానమని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ వేదికలపై పార్టీ ప్రచారం చేయడం ద్వారా ఎన్నికల సమాన అవకాశాల సూత్రాన్ని సీఎం ఉల్లంఘించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ చర్యలపై తక్షణమే విచారణ చేపట్టి, ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఇటువంటి వ్యవహారాలు ప్రజాస్వామ్యానికి హానికరమని పేర్కొంటూ, ఎన్నికల నియమావళి కఠినంగా అమలు కావాలని కోరారు.

# మందు బాబులకు షాక్


### రేపటి వరకు మద్యం షాపులు, బార్లు బంద్
### ఫలితాల రోజైన 13న కూడా ఆంక్షలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మద్యం ప్రియులకు బ్యాడ్ న్యూస్ చెప్పాల్సిందే. ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి పోలింగ్ రోజు అయిన ఫిబ్రవరి 11 సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో ఉన్న వైన్ షాపులు, బార్లు మూసివేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. అలాగే ఎన్నికల ఫలితాల రోజు అయిన ఫిబ్రవరి 13న కూడా మద్యం దుకాణాలు, బార్లు పూర్తిగా మూసివేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగియనుండటంతో, అదే సమయం నుంచి ఈ ఆంక్షలు అమల్లోకి వస్తాయని వెల్లడించారు.

# ఎంతైనా పంచుతాం!

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**




- మున్సిపాలిటీ ఎన్నికల్లో నోట్ల వరద
- కోట్లు ఖర్చు చేస్తున్న అభ్యర్థులు
- గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నేతలు
- టికెట్ దక్కించుకోవడం నుంచి పోలింగ్ వరకు డబ్బే డబ్బు..
- చైర్మన్ అభ్యర్థులపై కోట్లలోనే ఖర్చు
- పెద్ద మున్సిపాలిటీలైతే మరింత భారం
- ఈసారి ఎన్నికల్లో షాడోలుగా రియల్టర్లు, బడా బాబులు
- కార్పొరేషన్లపైనే పార్టీల ప్రధాన గురి
- పోల్ మేనేజ్మెంట్ కోసం రంగంలోకి టీంలు
- భారీగా డబ్బు పంచేందుకు సిద్ధం
- అందరితోనూ 'మీకే మా ఓటు' అంటున్న ఓటర్లు

తెలంగాణ గడ్డపై మున్సిపల్ ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వేడి పరాకాష్టకు చేరింది. ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో గెలుపు జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు వ్యూహప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి. అయితే,ఈ ఎన్నికల్లో సిద్ధాంతాల కంటే డబ్బే కీలకంగా మారింది. వార్డు స్థాయి నుంచి కార్పొరేషన్ మేయర్ పీఠం దాకా.. అభ్యర్థులు కోట్లు కుమ్మరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా మారుస్తున్న తీరు విస్మయానికి గురి చేస్తోంది.

**టికెట్ దక్కించుకోవడానికే..**

మున్సిపల్ టికెట్ దక్కించుకోవడమే ఒక పెద్ద యుద్ధంగా మారింది. బలం ఉన్న అభ్యర్థుల నుంచి పార్టీల కీలక నేతలు భారీగా వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ లాభదాయకంగా ఉన్న ప్రాంతాల్లో ఒక్కో వార్డు టికెట్ కోసం రూ. 50 లక్షల నుండి రూ. కోటి, కోటిన్నర వరకు పార్టీ ఫండ్ రూపంలో అగ్రనేతలకు చేరినట్లు రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మేయర్ పదవి ఆశిస్తున్న వారు జిల్లా స్థాయి నేతలకు అంతకంటే ఎక్కువే సమర్పించుకున్నట్లు సమాచారం.

**'రెబల్స్'కు లక్షల్లో సెటిల్మెంట్లు..**

పార్టీ అధికారిక అభ్యర్థులపై తిరుగుబాటు చేసిన రెబల్స్‌ను దారికి తెచ్చుకోవడానికి అభ్యర్థులు నానా తంటాలు పడ్డారు. నామినేషన్ ఉపసంహరించుకోవడానికి బేరసారాలు జోరుగా సాగాయి. పోటీ నుంచి తప్పుకుంటే రూ.10 లక్షల నుండి రూ.20 లక్షల నగదు ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

**ప్రచారంలో ఖర్చుల మోత!**

ప్రస్తుతం కార్యకర్తలు స్వచ్ఛందంగా రావడం తగ్గిపోయింది. జెండా పట్టుకోవాలన్నా, ర్యాలీలో పాల్గొనాలన్నా రేటు ఫిక్స్ అయిపోయింది. ప్రచారానికి వచ్చే ఒక్కో వ్యక్తికి రోజుకు రూ. 500 నుంచి రూ.1000 నగదు ఇస్తున్నారు. మధ్యాహ్నం చికెన్, మటన్ బిర్యానీ ప్యాకెట్లు, సాయంత్రం కాగానే క్వార్టర్ బాటిల్ తప్పనిసరి. ఒక్కో వార్డులో సగటున 100 మంది కార్యకర్తలను మెయింటైన్ చేయాలంటే రోజుకు సుమారు కనీసం రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు కేవలం తిండి, మందు, భత్యాలకే పోతోంది. 10 రోజుల ప్రచారానికి ఇది రూ. 20 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం

**ఓటుకు నోటు వెరీ కాస్ట్లీ..**

ప్రచారానికి తెరపడడంతో పోలింగ్ కు ఒక్క రోజే ఉండడంతో అభ్యర్థులు పోల్ మేనేజ్మెంట్ పనిలో పడ్డారు. గల్లీ గల్లీలో టీమ్స్ రంగంలోకి దిగాయి. సాధారణ మున్సిపాలిటీల్లో ఒక్కో ఓటుకు రూ. 2వేలు, టఫ్ ఫైట్ ఇచ్చే ప్రతిష్టాత్మక సిరిసిల్ల మున్సిపాలిటీల్లో రూ. 3వేల వరకు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కార్పొరేషన్లలో పోటీని బట్టి రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఇస్తున్నారట.. బాగా పోటీ ఉన్న వరంగల్, కరీంనగర్ వంటి పట్టణాల్లో కొన్ని వార్డుల్లో ఓటుకు రూ.5వేల నుంచి నుండి రూ. 6వేల వరకు కూడా ఇచ్చేందుకు అభ్యర్థులు సిద్ధపడటం గమనార్హం.

**బరిలో 'రియల్' కింగ్స్..**

ఈసారి ఎన్నికల్లో సామాన్యుల కంటే రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కాంట్రాక్టర్లు, బడా బిజినెస్ మెన్లే ఎక్కువగా కనిపిస్తున్నారు. మున్సిపాలిటీల్లో వచ్చే పన్నులు, లేఅవుట్ల పర్మిషన్లు, ప్రభుత్వ కాంట్రాక్టులపై పట్టు సాధించడం వీరి ప్రధాన ఉద్దేశం. తాము ఖర్చు పెట్టిన కోట్లకు పదింతలు సంపాదించవచ్చనే ఆశతో వీరు బరిలోకి దిగుతున్నారు. బడా నాయకులు తమ బంధువులను లేదా భార్యలను రంగంలోకి దింపి వెనుక నుండి చక్రం తిప్పుతున్నారు.

**కీలక కార్పొరేషన్లపైనే కన్ను..**

వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, రామగుండం వంటి కార్పొరేషన్లలో పోటీ అత్యంత రసవత్తరంగా ఉంది. వీటి మేయర్ సీట్లు దక్కించుకోవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ శక్తులన్నీ ఒడ్డుతున్నాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ జోర్లు ఎక్కువగా ఉన్న చుట్టుపక్కల పురపాలికల్లో ఓటర్లకు నిజంగానే పండగ' వాతావరణం కనిపిస్తోంది. ఈకీలక ప్రాంతాల్లో ఓటర్లకు భారీగానే డబ్బు ముచ్చచెబుతున్నట్లు సమాచారం.

# ప్రతి ఒక్కరి లెక్క తేలుస్తా..

- చందాలు, దందాలు చేస్తే కింద పడుద్ది జాగ్రత్త
- కారుకూతలు కూస్తే బొక్కలోకి పంపడం ఖాయం
- ఏప్రిల్‌లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- అధికారంలో లేని మీరు ఎలా అభివృద్ధి చేస్తారు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఏదులాపురంలో ఎన్నికల ప్రచార ముగింపు సభ

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి**



రాజకీయాల ముసుగులో అరాచకాలు చేస్తామన్నా... ఫోన్లలో బెదిరింపులకు దిగినా సహించేది లేదు. 11వ తేదీ ఎన్నికలు ముగియనివ్వండి.. హద్దులు దాటిన ప్రతి ఒక్కరి లెక్క తేలుస్తా... చందాలు, దందాలు చేస్తే కింద పడుద్ది జాగ్రత్త! తింగరి వేషాలు వేస్తే ఊరుకోం.. చట్టప్రకారం మీ అందరినీ బొక్కలో వేయించడం ఖాయం.. అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యర్థులను హెచ్చరించారు. ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

**దందాలకు కాలం చెల్లింది..**

ప్రచార పర్వంలో ప్రత్యర్థుల తీరుపై మంత్రి నిప్పులు చెరిగారు. ఎవరైనా కారుకూతలు కూస్తే చట్టరీత్యా ఉక్కుపాదం మోపుతాం. మీ బెదిరింపులకు ఇక్కడ ఎవరూ భయపడరు. మీ దందాలకు, దౌర్జన్యాలకు ప్రజలు ఈ ఎన్నికలతో ఫుల్ స్టాప్ పెట్టబోతున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగాలి.. అశాంతి సృష్టించాలని చూస్తే ఉక్కుపాదం మోపుతాం అని స్పష్టం చేశారు.

**అధికారం లేని మీరు అభివృద్ధి ఎలా చేస్తారు?**

రంగురంగుల కండువాలు వేసుకుని వస్తున్న నాయకులను మంత్రి సూటిగా నిలదీశారు. అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వ సాయం ఉండాలి. అధికారంలో ఉన్న మేమే పనులు చేయగలం. ఏ అధికారం ఉందని మీరు మేలు చేస్తామంటూ ప్రజల వద్దకు వస్తున్నారు? పదేళ్లు అధికారంలో ఉన్న ఆ దొరలకు పేదలకు ఇల్లు ఇవ్వాలనే జ్ఞానం లేదు.. అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్త రేషన్ కార్డులు, హాస్టల్ విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు వంటి ఎన్నో సంక్షేమ ఫలాలను అందించామని గుర్తుచేశారు.

**ఏప్రిల్‌లో ఇందిరమ్మ ఇళ్లు..**

వచ్చే ఏప్రిల్ నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేపడతామని మంత్రి ప్రకటించారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకున్న పేదలకు పట్టాలు ఇచ్చే బాధ్యత నాదే. ఏదులాపురాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా.. అని హామీ ఇచ్చారు.

మున్నేరు వరద బాధితులకు అండగా ఉన్నామని, వచ్చే వర్షాకాలం నాటికి రిటైనింగ్ వాల్ పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. సభ అనంతరం వరంగల్ క్రాస్ రోడ్డు నుంచి నాయుడు పేట సర్కిల్ వరకు వేలాది మందితో జరిగిన భారీ ర్యాలీలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ప్రలోభాల యత్నం

- గజ్వేల్, సిరిసిల్లలో భారీగా మద్యం పట్టివేత
- బీఆర్ఎస్ అభ్యర్థుల ఇళ్లల్లో నిత్యావసరాలు సీజ్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నిల్వ ఉంచినట్లు అనుమానిస్తున్న మద్యం, నిత్యావసర సరుకులను ఎన్నికల అధికారులు భారీగా సీజ్ చేశారు. ఈ పట్టివేతలు కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్, అలాగే కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్ల లో జరగడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఓటర్లను ఆకర్షించేందుకు ముందుగానే సరుకులు నిల్వ ఉంచినట్లు అధికారులు భావిస్తున్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ రెండో వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి గోలి మమత నివాసంలో తనిఖీలు చేపట్టిన అధికారులు, పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్లు మరియు నిత్యావసర సరుకులను గుర్తించి సీజ్ చేశారు. ఇవి ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద నిల్వ ఉంచినవిగా అధికారులు నమోదు చేశారు. ఇదే తరహాలో సిరిసిల్ల మున్సిపాలిటీ ఐదో వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి దార్నం అరుణ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా, భారీగా లిక్కర్ నిల్వలు బయటపడ్డాయి. ఓటర్లకు పంపిణీ చేయాలనే ఉద్దేశంతోనే మద్యం దాచినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ రెండు ఘటనలపై ఎన్నికల అధికారులు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రలోభాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే ఎలాంటి మినహాయింపులు ఉండవని అధికారులు స్పష్టం చేశారు.

## నిజామాబాద్‌లో
# కాంగ్రెస్ మేయర్ అవసరం

- అప్పుడే అభివృద్ధి సాధ్యం
- కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాల విషయంలో విఫలం
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- బీజేపీ ఎంపీ అరవింద్‌పై తీవ్ర విమర్శలు

**వేద న్యూస్, నిజామాబాద్**



నిజామాబాద్ అభివృద్ధి చెందాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ మేయర్ గెలవడం అత్యవసరమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా కంటేశ్వర్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రజల అసలైన ఆకాంక్షలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై తీవ్ర విమర్శలు చేశారు. తన స్థాయికి మించి మాట్లాడుతున్నారని, తన ఆస్తులపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేయడం సరికాదని, ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాల విషయంలో విఫలమైందని, సంపద కొద్దిమందికే పరిమితమైందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మక కార్యక్రమమని పేర్కొన్నారు. కాంగ్రెస్ మేయర్ గెలిస్తే నిజామాబాద్ అభివృద్ధి దిశగా ముందుకెళ్తుందని, సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే నగర అభివృద్ధికి రూ.1000 కోట్ల నిధులు ప్రకటించారని గుర్తు చేశారు. రెండో దశలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కూడా హామీ ఇచ్చారని తెలిపారు. ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ మేయర్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 10, 2026

# పాతూరి సాధనకు డాక్టరేట్ ప్రదానం

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

శ్రీనగర్ గ్రామానికి చెందిన పాతూరి సాధన కు జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ విభాగంలో డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా లభించింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 56, 57, 58వ బ్యాచ్‌ల కంబైన్డ్ కాన్వకేషన్ కార్యక్రమం సోమవారం రాజేంద్రనగర్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సాధన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. గమనార్హమైన విషయం ఏమిటంటే, ఆమె ఇదే విశ్వవిద్యాలయంలో బీఎస్సీ, ఎమ్మెస్సీతో పాటు పీహెచ్‌డీ వరకు విద్యను పూర్తి చేయడం. సాధన తల్లిదండ్రులు పాతూరి నరసింహారావు మరియు శారద తమ కుమార్తె సాధించిన ఈ ఘన విజయాన్ని తమ జీవిత కష్టాలకు దక్కిన ఫలితంగా అభివర్ణిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. అలాగే, సాధన భర్త మధుర గీత్, మామయ్య రవెళ్ల రామారావు (వరంగల్ స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇన్‌స్పెక్టర్, లక్ష్మీ మెగా టౌన్షిప్),



అత్తయ్య సుగుణ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ సాధన భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే విధంగా ఉన్నత విద్యలో రాణించడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఉపాధి హామీ పనులను ప్రారంభించిన సర్పంచ్

**వేద న్యూస్, కారేపల్లి:**

ఉపాధి హామీ పథకం పనులను భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు లేని సమయంలో గ్రామ ప్రజలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా, తమ గ్రామంలోనే జీవనోపాధి పొందేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. గ్రామంలోని పంట పొలాలను అభివృద్ధి చేయడం, ప్రజలకు స్థానికంగా ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఆయన గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల ఉపాధి కల్పించడమే కాకుండా, గ్రామంలోనే స్వేచ్ఛగా పని చేసుకునే అవకాశం లభిస్తోందన్నారు. అనేక మంది కూలీలు ఈ పథకం ద్వారా ఉపాధి పొందుతూ తమ జీవనాన్ని సాగిస్తున్నారని తెలిపారు. అలాంటి ప్రజాప్రయోజన పథకాన్ని రద్దు చేసే దిశగా నేటి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. దీనిని ప్రజలందరూ కలిసికట్టుగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కొలతల ప్రకారం పని చేస్తే ప్రతి ఒక్కరికీ న్యాయమైన కూలి లభిస్తుందని తెలి



పారు. గ్రామ ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి అనిల్ కుమార్, ఉపసర్పంచ్ భిక్కులాల్, వార్డు సభ్యులు గాంధీ, దేవి, సుమ, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి




**వేద న్యూస్, నల్లబెల్లి :**

భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పొనగండ్ల గ్రామం లో ఎనిమిది సంవత్సరాల బాలికపై అత్యాచారం చేసిన నిందితులను గుర్తించి పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని స్థానిక తహసీల్దార్ ముప్పు కృష్ణకు తెలంగాణ దళిత విద్యావంతుల ఐక్యవేదిక వరంగల్ జిల్లా కార్యదర్శి గట్టు సాంబయ్య ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేసియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ప్రభుత్వం ఇవ్వాలన్నారు. బాలికకు వైద్యానికి అయ్యే ఖర్చులు మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. తక్షణమే అత్యాచార సంఘటన పై సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని దోషులను కఠినాతి కఠినంగా శిక్షించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పరికిరత్నం,యువ నాయకులు ప్రకాష్, మేర సంఘం మండల కార్యదర్శి ఓదెల రవి, జితేందర్, ప్రకాష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే నా లక్ష్యం

**– ముస్త్యాల అరుణ బాల్ నర్సయ్య 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి**

**వేద న్యూస్, సిద్దిపేట :**

చేర్యాల మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ, బలపరిచిన 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ముస్త్యాల అరుణ బాల నర్సయ్య, ఎన్నికలలో భాగంగా ఆరో వార్డు పరిధిలో ఉన్న ప్రతి గడపగడపకు తిరుగుతూ ప్రతి ఒక్కరితో అనురాగ ఆప్యాయంతో ఆధార అభిమానాలతో పలకరిస్తూ ఎన్నికల్లో ఓటర్లు కారు గుర్తకు ఓటు వేసి గెలిపించి తమను ఆశీర్వదించమని కోరారు. నిస్వార్థ సేవకురాలుగా ఉంటానని ఆరవవార్డు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు.వారు మాట్లాడుతూ. . ప్రజలకు ఏ సమస్య ఉన్న ప్రజల వద్దకే వెళ్లి పరిష్కరిస్తానని చేర్యాల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చేర్యాలను అభివృద్ధి పథంలో నడిపిస్తానంటూ "మీ ఓటు నా బలం మీరే నా



బలగం" అని అన్నారు.ఆరో వార్డులో ఉన్న సమస్యలను సి.సి రోడ్లు గాని డ్రైనేజ్ వ్యవస్థను, వీధి దీపాలు, రేషన్ కార్డుల మంజూరు. పెన్షన్ల మంజూరు ప్రత్యేక దృష్టి,పెట్టి అన్ని రంగాలుగా 6వ వార్డు అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బత్తుల గీత గెలుపే లక్ష్యంగా కారేపల్లిలో ప్రచారం

**వేద న్యూస్, కారేపల్లి:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైరా రాజకీయాలు వేడెక్కాయి. 2వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బత్తుల గీత గెలుపును లక్ష్యంగా చేసుకుని పార్టీ శ్రేణులు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. ఈ ప్రచారంలో మాజీ జిల్లా డీసీసీబీ చైర్మన్ పువ్వళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు కారేపల్లి నుంచి వచ్చిన భారీ కాంగ్రెస్ సైన్యం పాల్గొంది. వార్డులోని పలు గల్లీల్లో పర్యటించిన కాంగ్రెస్ నేతలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బత్తుల గీతను భారీ మెజారిటీతో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. 2వ వార్డు అభివృద్ధి కోసం హస్తం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ప్రచారానికి వార్డు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, కాంగ్రెస్ విజయం ఖాయమని నేతలు



ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి సర్పంచ్ మేదరి టోనీ, పోలంపల్లి సర్పంచ్ హేమలత బాలాజీ, మంగలి తండా సర్పంచ్ దారావత్ వెంకటేశ్వర్లు సహా పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# ప్రారంభం కాని రోడ్డు నిర్మాణ పనులు

**– నిధులు మంజూరై మూడు నెలలు**

**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండలంలోని రాణంపల్లి గ్రామ శివారు నుంచి పంట పొలాలకు వెళ్లే మెటల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి రూ.50 లక్షల నిధులు మంజూరు చేశారు. అయితే నిధులు మంజూరై మూడు నెలలు గడుస్తున్నప్పటికీ, ఇప్పటి



వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే పంట పొలాలకు వెళ్లే రైతులకు, వాహనదారులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

# బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యేదెప్పుడో?

**– పనులు ప్రారంభించి రెండేళ్లు**

**– త్వరగా పూర్తి చేయాలని రైతులు, గ్రామస్తుల ఆందోళన**

**వేద న్యూస్, రుద్రూర్:**

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామ శివారు నుంచి బోధన్ వైపుకు వెళ్లే బ్రిడ్జి నిర్మాణ పనులను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.301.50 లక్షల వ్యయంతో 2023 సంవత్సరంలో ప్రారంభించారు. అయితే ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలోనే అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పనులు ప్రారంభించి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు బ్రిడ్జి నిర్మాణం పూర్తికాలేదని రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా ఈ పనులు ముందుకు సాగకపోవడంతో నిరాశ వ్యక్తం



చేస్తున్నారు. ఈ బ్రిడ్జి పూర్తయితే రైతులకు, గ్రామస్తులకు రాకపోకలు మరింత సులభంగా మారుతాయని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# విధి నిర్వహణలో 'డిష్' ఆపరేటర్ బలి

**– కరెంటు షాక్‌తో లాలయ్య మృతి**

**వేద న్యూస్, కారేపల్లి:**

తన వృత్తినే దైవంగా భావించి నిత్యం ప్రజలకు సేవలందించే ఒక కష్టజీవిని విధి వెక్కిరించింది. ఇల్లందు మండలం లలితాపురం సమీపంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో కారేపల్లి గ్రామాని కి చెందిన డిష్ ఆపరేటర్ జూపల్లి లాలయ్య కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో కారేపల్లి గ్రామం విషాదంలో మునిగిపోయింది. స్థానికుల కథనం ప్రకారం. . లాలయ్య ప్రతిరోజులాగే డిష్ కేబుల్ మరమ్మతుల కోసం లలితాపురం శివారుకు వెళ్లారు. కేబుల్ లైన్ సరి



చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో తీవ్రంగా కరెంటు షాక్ తగిలింది. విద్యుత్ ఘాతానికి గురైన లాలయ్య అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. లాలయ్య మృతి వార్త తెలియగానే గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. ఎప్పుడూ చిరునవ్వుతో పలకరిస్తూ, డిష్ సమస్యలు వచ్చిన వెంటనే స్పందించే వ్యక్తిగా ఆయనకు మంచి పేరు ఉండేది. అలాంటి వ్యక్తి అకాల మరణం పట్ల సర్వత్రా ఆవేదన వ్యక్తమవుతోంది. లాలయ్య మృతితో కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్యాపిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాదంలో మరణించిన లాలయ్య కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అంగన్వాడీ కేంద్రానికి తాగునీటి ప్లాంట్ ఏర్పాటు




**– నడిగొట్ల హరికృష్ణ సొంత ఖర్చులతో సేవా కార్యక్రమం**

**వేద న్యూస్, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు తాగునీటి సౌకర్యం లేకపోవడం గురించి గ్రామ సభలో అంగన్వాడీ టీచర్ తెలియజేశారు. దీనికి స్పందించిన గ్రామానికి చెందిన నడిగొట్ల హరికృష్ణ (న్యాయవాది) తమ సొంత ఖర్చులతో అంగన్వాడీ కేంద్రానికి ఆర్ఓ తాగునీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభ కార్యక్రమాన్ని గ్రామ నూతన పాలకవర్గం చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఊరడీ సునీత రాజిరెడ్డి, ఉపసర్పంచ్ బెజుగం మహేష్, వార్డు సభ్యులు సంతపురీ లావణ్య మహేందరెడ్డి, తాడేం లత శ్రీనివాస్, ఎరుగోక్కుల రేవతి బాలయ్య, బాణాల రాజు, గుండెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఎరుగోక్కుల రమేష్, పాముల వంశీ, పాసుల మధుతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు



**వేద న్యూస్, కారేపల్లి:**

వైరా మునిసిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ 2వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బత్తుల గీత గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజలను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పోలంపల్లి సర్పంచ్ హేమలత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంబాబు నాయక్, భీముడు నాయక్, వినోద్ నాయక్, హేమ్లా నాయక్, చిన్న మడంపల్లి సర్పంచ్ రూప్లా, ధారావత్ వెంకటేశ్వర్లు, వాంకుడోత్ హనుమంతరావు, అజ్మీరా రవి సహా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మికుల పోరాటం

- 12న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి
- కార్మిక సంఘాల పిలుపు

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో సోమవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులకు మరణ శాసనంగా మారాయని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పని సమయాన్ని తొలగించి పన్నెండు గంటల పని విధానాన్ని తీసుకురావడం కార్మికులపై తీవ్రమైన దాడిగా పేర్కొన్నారు. బోయినిపల్లి మండలంలో పనిచేస్తున్న హమాలి, భవన నిర్మాణ, గ్రామపంచాయతీ, బీడి, ఉపాధి హామీ, ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన, విద్యుత్ సంస్థ హెల్పర్ కార్మికులు ఈ సమ్మెకు మద్దతు ప్రకటించారు. సంఘం ఏర్పాటు, సమ్మె హక్కు, పని భద్రత,



ప్రమాద బీమా వంటి మౌలిక హక్కులను లేబర్ కోడ్‌ల ద్వారా హరించారని తెలిపారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం పారిశ్రామిక యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శిస్తూ, ఈ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న ఉదయం 9 గంటలకు బోయినిపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించే నిరసనలో పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి గురజాల శ్రీధర్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రామంచ అశోక్‌తో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

- బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్



**వేద న్యూస్, హైదరాబాద్ :**

ఎన్నికలు జరిగే మున్సిపల్ కార్పోరేషన్లలో అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని, ఎన్నికలు జరిగే అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగరాలని అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం నాడు పత్రికా సమావేశంలో మాట్లాడుతూ. రెండున్నర సంవత్సరాల నుండి ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న కొంతమంది కళ్ళు ఉంది చూడలేని కబోదులకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హయాంలో చేసిన అభివృద్ధి లిస్టు చేంతాడంత ఉందని అన్నారు. రెండు సంవత్సరాలలో 70 వేల ఉద్యోగాలు కల్పించడం, హాస్టల్ గురుకుల విద్యార్థుల మెస్ చార్జీలు 40శాతం పెంచడం కాస్మోటిక్ చార్జీలలో 200 శాతం పెంచడం లాంటివి కాకుండా 25వేల కోట్లతో 100 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మాణం కొనసాగుతుందని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు అల్పాహారం అందించాలని ముఖ్యమంత్రి సంకల్పంగా తీసుకున్నారని 25.3 లక్షలమంది రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని తొమ్మిది రోజుల్లో 9000 కోట్లు రైతు భరోసా నిధులు ప్రభుత్వం ఇచ్చిందని వ్యవసాయ రంగానికి 1.15 లక్షల కోట్లు ఖర్చు చేశారని వ్యవసాయాన్ని పండుగ చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తరువాత మహిళల చేతిలో 27 వేల కోట్లు నిధులు పెట్టిన ఘనత కూడా కాంగ్రెస్ దేనిని ప్రస్తుతం మహిళలకు పెట్రోల్ బంకులు నిర్వహించుకునే సదవకాశాన్ని కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్ కే దక్కుతుందని నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో మున్సిపాలిటీల అభివృద్ధి కోసం 17,442 కోట్లు ఖర్చు చేశామని భారత రాష్ట్ర సమితికి, భారతీయ జనతా పార్టీకి ఓట్లు వేస్తే చెత్తబుట్టలో వేసినట్లేనని అభివృద్ధి సంక్షేమం అందిస్తున్న కాంగ్రెస్ కు పట్టం కట్టాలని అభిప్రాయానికి ఓటర్లు వచ్చారని, ఆదిలాబాద్ నుండి గద్వాల, పరిగి నుంచి కోదాడ వరకు కాంగ్రెస్ ను గెలిచి తీరుతుందని స్పష్టత ఓటర్లలో ఉంది అన్నారు. ఒక పది సంవత్సరాలు కుటుంబ పాలనలో నలిగిన ప్రజలు ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ప్రజాపాలన నడుస్తుందన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రజలు ఉన్నారని గత ప్రభుత్వ హయాంలో అర్హులకు రేషన్ కార్డులు అందలేదని అర్హులైన కుటుంబ సభ్యులకు రేషన్ కార్డులో నమోదు చేసే అవకాశం కూడా ఉండేది కాదని గత ప్రభుత్వం ఏడాదికి రూ.12,000 కోట్లు ఖర్చు చేసి 2.8 కోట్ల మందికి దొడ్డు బియ్యం ఇచ్చే వారని ఆ దొడ్డు బియ్యం తినలేక 90 శాతం మంది లబ్ధిదారులు కిలో ఐదు రూపాయల చొప్పున విక్రయించే వారని దీనితో దొడ్డు బియ్యం పక్కదోవ పట్టి రైస్ మిల్లులకు, బీర్ల కంపెనీలకు, పౌల్ట్రీ ఫాంలకు వెళ్లిపోయేవని తెలిపారు. గత ప్రభుత్వం ఇలాంటి అక్రమ వ్యాపారాలకు తెగబడిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉచిత బియ్యం పక్కదోవ పట్టవద్దన్న ఉద్దేశంతో సన్నబియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని దేశంలో 29 రాష్ట్రాలలో ఎక్కడా సన్న బియ్యం ఇస్తున్న దాఖలాలు లేవని అన్నారు 13,600 కోట్లతో 3.15 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నట్లు పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందించామని పార్టీలతో ప్రమేయం లేకుండా ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందించే బాధ్యత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 100% శాతం తన భుజస్కందాలపై వేసుకుని విజయవంతం చేశారని అన్నారు. అంతేకాకుండా రైతులకు బోనస్ ఇవ్వడం, సన్నధాన్యం కొనుగోలు చేస్తూ రైతులకు ఎక్కడ కష్టం కలగకుండా ప్రజా పాలన సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అన్ని మున్సిపాలిటీలలో, గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రి కే కానుకగా అందజేయాలని నూతి శ్రీకాంత్ గౌడ్ కోరారు.

**దేశంలో కులగణన చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్**

దేశంలోనే మొట్టమొదటిసారి కులగణన చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం కూడా తలవంచి కుల గణన చేపట్టబోతుందని, ఎస్సీ బిడ్డల జీవితకాల కోరిక అయినా ఏ.బి.సి.డి ల వర్గీకరణ చేసి చూపించామని 13వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి సన్న బియ్యం ఇస్తున్న ప్రభుత్వం ఏకైక తెలంగాణ ప్రభుత్వమేనని రాష్ట్రంలో ప్రజల సంతోషాన్ని ప్రతిపక్ష నాయకులు ఓర్వ లేకపోతున్నారని అక్కసుతో, అసూయతో, అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్, ఉప ఎన్నికలలో పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పని అయిపోయింది అని ప్రచారం చేశారని కానీ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారని ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా వారు “కారు“ కూతలు కూస్తున్నారని మునిసిపల్ ఎన్నికల్లో 100కు 100శాతం కాంగ్రెస్ పార్టీ గెలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు.

# పోలింగ్ రోజున పబ్లిక్ హాలిడే

- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో స్థానిక సెలవులు ప్రకటించినట్లు ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. 10వ తేదీ మంగళవారం, 11వ తేదీ బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన విద్యా సంస్థలు, కార్యాలయాలకు స్థానిక సెలవులు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. చట్ట ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కార్పొరేషన్లు, సంస్థల ఉద్యోగులు, సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ రోజైన 11వ తేదీ బుధవారం పబ్లిక్ హాలిడే వర్తిస్తుందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు.

# రూ.4.76 కోట్ల గంజాయి కాల్చివేత



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల పరిధిలో ఉన్న ఆరు ఎక్సైజ్ స్టేషన్లలో నమోదైన 47 కేసులకు సంబంధించిన మొత్తం 953 కేజీల గంజాయిని కాల్చివేయాలని ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాల మేరకు ఆయా ఎక్సైజ్ స్టేషన్లలో కేసుల వారిగా గంజాయిని ఒకేచోట చేర్చి, ప్రభుత్వ అనుమతి పొందిన ఏడబ్ల్యూఎం కన్సల్టింగ్ లిమిటెడ్ కాల్చివేత పరిశ్రమలో సోమవారం కాల్చివేశారు. ఈ పరిశ్రమ తల్లేడ మండలం గోపాల్‌పేట్‌లో ఉంది. కాల్చివేసిన గంజాయి విలువ సుమారు రూ.4.76 కోట్లుగా అంచనా వేయబడింది. వివరాల ప్రకారం, ఖమ్మం 1 ఎక్సైజ్ స్టేషన్‌లో 9 కేసుల్లో 42 కేజీలు, ఖమ్మం2 స్టేషన్‌లో 5 కేసుల్లో 57 కేజీలు, మధిర స్టేషన్‌లో 7 కేసుల్లో 193 కేజీలు, కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ స్టేషన్‌లో 2 కేసుల్లో 114 కేజీలు, మణుగూర్ స్టేషన్‌లో ఒక కేసులో 21 కేజీలు, భద్రాచలం స్టేషన్‌లో 23 కేసుల్లో 625 కేజీల గంజాయిని కాల్చివేసినట్లు డిప్యూటీ కమిషనర్ జనార్ధన్ రెడ్డి తెలిపారు

# బాధితుల సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ లక్ష్యం

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- 21 ఫిర్యాదులు స్వీకరణ

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 21 ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులకు సంబంధించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వారి వినతులను శ్రద్ధగా వినాలని సూచించారు. అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ, పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తామని తెలిపారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి



తీసుకురావడం వల్ల వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.

# ఏదులాపురంలో పీఎస్ఆర్ యూత్ బైక్ ర్యాలీ

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పీఎస్ఆర్ యూత్ ఖమ్మం నగర అధ్యక్షుడు దుంపల రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ ఏదులాపురంలో విజయవంతమైంది. మారెమ్మ గుడి నుంచి వెంకటగిరి క్రాస్ రోడ్డు వరకు వందలాది బైక్‌లతో కాంగ్రెస్ శ్రేణులు భారీ ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కళ్లెం వెంకట్ రెడ్డి, అజ్మీర అశోక్ నాయక్, ఇమామ్, మజీద్, ఏనుగు మహేష్ పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పీఎస్ఆర్ యూత్ అధ్యక్షుడు దుంపల రవికుమార్ నాయకత్వంలో జరిగిన ఈ ర్యాలీతో ఏదులాపురం పురవీధులన్నీ ‘జై కాంగ్రెస్’ నినాదాలతో హోరెత్తాయి. యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ర్యాలీ ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది.

# సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సన్మానం

- మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ చేతుల మీదుగా ఘనత

**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, రుద్రూర్ గ్రామ సర్పంచ్ ఇందూర్ సునీత, ఉపసర్పంచ్ షేక్ నిస్సర్‌లను శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో 14 సంవత్సరాల లోపు విభాగంలో రెండవ స్థానాన్ని సాధించిన స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి సాయినాథ్‌ను కూడా ఆయన అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ మాజీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్, సెక్రటరీ ప్రేమ్ దాస్, జిల్లా పరిషత్ హైస్కూల్ పీఈటీ సంతోషి తదితరులు పాల్గొన్నారు.



వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 10, 2026

# పల్లెల్లో 'బెల్ట్' జోరు!



- ఇల్లంతకుంట మండలంలో ఏరులై పారుతున్న మద్యం
- ఫోన్ చేస్తే దర్జాగా ఇంటికే..
- మద్యానికి బానిసవుతున్న మైనర్లు
- ఎమ్మార్పీ కంటే అదనపు వసూళ్లు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలంలో అక్రమ బెల్ట్ షాపులు విచ్చలవిడిగా విస్తరించి, గ్రామాలను మద్యానికి అడ్డాగా మారుస్తున్నాయి. వీధి వీధిన, గల్లీ గల్లీన బెల్ట్ షాపులు వెలుస్తుండగా, మైనర్ల ఆరోగ్యాలు ప్రమాదంలో పడుతున్నాయనే ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. పర్యవేక్షణ లేమితో బెల్ట్ మాఫియా మరింత రెచ్చిపోతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో ఫోన్ చేస్తే చాలు మద్యం నేరుగా ఇంటి వద్దకు చేరే పరిస్థితి నెలకొంది. మినరల్ వాటర్ వస్తుందో లేదో తెలియదు కానీ, మద్యం మాత్రం కచ్చితంగా డెలివరీ అవుతోందని గ్రామస్తులు అంటున్నారు. గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఉందా లేదా అనేది అనుమానమే కానీ, బెల్ట్ షాపులు లేని గ్రామం మాత్రం లేదని స్థానికుల ఆరోపిస్తున్నారు.

**ప్రతి గ్రామంలో 2 నుంచి 6 బెల్ట్ షాపులు**

మండల వ్యాప్తంగా సుమారు 30కి పైగా బెల్ట్ షాపులు పనిచేస్తున్నట్లు అంచనా. ఒక్కో గ్రామంలో కనీసం 2 నుంచి 6 వరకు బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. కొందరు తమ ఇళ్లనే బెల్ట్ షాపులుగా మార్చుకుని అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారు. బెల్ట్ షాపులకు నేరుగా వైన్ షాపుల నుంచే మద్యం సరఫరా అవుతోందనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. వైన్ షాప్ సిబ్బంది, బెల్ట్ షాప్ నిర్వాహకులు చేతులు కలిపి ఒక్కో సీసాపై అదనంగా రూ.10 నుంచి రూ.15 వరకు వసూలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అనంతరం బెల్ట్ షాప్ నిర్వాహకులు క్వార్టర్ సీసాను ఎమ్మార్పీపై అదనంగా రూ.50 నుంచి రూ.70 వరకు వసూలు చేసి విక్రయిస్తున్నారు.

**ఎమ్మార్పీకి రెట్టింపు ధరలు**

మండల కేంద్రంలో ప్రభుత్వ దుకాణాల్లో రూ.150 ఉన్న క్వార్టర్ సీసా బెల్ట్ షాపుల్లో రూ.300 వరకు అమ్ముతున్నారని ఆరోపణలు ఉన్నాయి. డిమాండ్‌ను బట్టి ధరలు ఇంకా పెరుగుతున్నాయట. మూడు పెగ్గులు, ఆరు గ్లాసులుగా ఈ అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. కొన్ని గ్రామాల్లో మహిళల చేతనే బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు చేయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గొడవలు రావద్దనే ఉద్దేశంతో ఇలా చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. నీళ్ల సీసాలు అమ్మినట్లే మద్యం సీసాలు విక్రయిస్తున్న పరిస్థితి కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పేరుకే పర్మిట్ రూములు**

లైసెన్స్ ఉన్న వైన్ షాపులకు అనుబంధంగా పర్మిట్ రూములు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్మిట్ లేని గదుల్లోనే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. చిల్లర దుకాణాలు, కిరాణా షాపులు, కూల్ డ్రింక్ షాపులు అన్న తేడా లేకుండా మద్యం అమ్మకాలు సాగుతున్నాయంటున్నారు.

**మైనర్లు కూడా మద్యానికి బానిసలు**

అక్రమ బెల్ట్ షాపుల కారణంగా 18 ఏళ్లు నిండని మైనర్లు కూడా మద్యానికి అలవాటు పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపిస్తున్నారు. ఇన్ని బెల్ట్ షాపులు నడుస్తున్నా ఎక్సైజ్ అధికారులకు సమాచారం లేదా? లేక మద్యం మాఫియాతో ఏమైనా రహస్య ఒప్పందాలున్నాయా? అనే అనుమానాలు ప్రజల్లో బలపడుతున్నాయి. 'ఎమ్మార్పీపై రూ.50 ఇస్తే ఏ అధికారి మీ జోలికి రారు' అంటూ వైన్ షాప్ నిర్వాహకులు చెప్పినట్లు బెల్ట్ షాప్ నిర్వాహకులే వెల్లడిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

గ్రామ గ్రామాన పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వైన్ షాప్ యజమానులు, బెల్ట్ షాప్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళలు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మద్యం మాఫియాపై కొరడా ఝుళిపించాలని కోరుతున్నారు.

## ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు

- వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ హెచ్చరిక




**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 11వ తేదీన పోలింగ్ పూర్తయ్యే వరకు బీఎన్ఎస్ఎస్2023 సెక్షన్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఆయన స్పష్టం చేశారు.

## తుది దశకు చేరుకున్న తారు రోడ్డు పనులు



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ పట్టణంలోని తెలంగాణ తల్లి చౌక్ నుంచి కోరుట్ల బస్టాండ్ వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు నాలుగేళ్ల క్రితం ప్రారంభించి మధ్యలో నిలిచిపోయిన పనులను ఇటీవల తిరిగి ప్రారంభించారు. ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం పూర్తయ్యాక రోడ్డు ఎత్తు పెంచడంతో పాటు మధ్యలో డివైడర్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఒకవైపు రోడ్డుకు తారు వేసే పనులు వేగంగా సాగుతున్నాయి.

## మడికొండలో రోడ్డు కబ్జా..



- మున్సిపల్ సిబ్బందిపైనే ఆరోపణలు
- వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కు కాలనీ వాసుల ఫిర్యాదు

**వేద న్యూస్, మడికొండ:**

హన్మకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ ఎస్సీ కాలనీలో ప్రభుత్వ భూములు, ప్రజల అవసరాల కోసం కేటాయించిన రహదారులు కబ్జాకు గురవుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి వెళ్లే 20 అడుగుల ప్రధాన రహదారి, కమ్యూనిటీ హాల్‌కు కేటాయించిన స్థలాన్ని అక్రమంగా ఆక్రమించినట్లు ఆరోపణలు వెలువెత్తాయి. ఈ అక్రమాలకు కాంగ్రెస్ నాయకుడు వస్కుల నాగరాజుతో పాటు జిడబ్ల్యూఎంసి సిబ్బంది ఆరూరి మరియమ్మ పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. రాజకీయ పలుకుబడితో పేదల హక్కులను కాలరాస్తే సహించ బోమని జంబవ సంఘం అధ్యక్షుడు ఆనందం హెచ్చరించారు. ఈ అంశంపై సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మడికొండ ఎస్సీ కాలనీ సంఘం సభ్యులు, జాంబో కమిటీ ప్రతినిధులు కలిసి జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి రహదారిని పునరుద్ధరించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి సహా పలువురు కాలనీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఆర్థిక అవగాహన పెంపొందించాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ల ఆవిష్కరణ



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారం సందర్భంగా రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ) సభ్యుల సమక్షంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. జనాభాలోని వివిధ వర్గాల్లో ఆర్థిక అవగాహన పెంచడమే లక్ష్యంగా ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత వారాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు కేవైసీ - సురక్షిత బ్యాంకింగ్‌కు మీ మొదటి అడుగు అనే థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కేవైసీ, సెంట్రల్ కేవైసీ రిజిస్ట్రీ (సీకేవైసీ), కేవైసీ మోసాలు, మనీ మ్యూలింగ్ నివారణ, ఖాతా క్రమశిక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సమన్వయంతో జిల్లాస్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఆర్బీఐ లేదా బ్యాంకులు ఎప్పుడూ మెయిల్స్, ఎస్ఎంఎస్‌లు పంపి లేదా ఫోన్ కాల్స్ ద్వారా ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు అడగవని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే ఆఫర్లు, లింకులు, అనుమానాస్పద కాల్స్‌కు స్పందించవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

- కామన్‌పల్లి సైలన్ బాబా అశోక్‌పై ఆరోపణలు



**వేద న్యూస్, జన్నారం:**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కామన్‌పల్లి గ్రామంలో సైలన్ బాబా అశోక్ గత 15 ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో ఆలయం నిర్మించి భూమిని ఆక్రమించుకున్నారనే ఆరోపణలపై ఇటీవల ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టారు. విచారణలో భూమి ప్రభుత్వానికి చెందినదేనని అధికారులు నిర్ధారించి, ఆలయం గోడతో పాటు సైలన్ బాబా పేరుతో ఉన్న బోర్డును తొలగించారు. ఈ ఘటనపై గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జన్నారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణపై పత్రికల్లో వార్తలు రావడంతో విషయం వెలుగులోకి వచ్చిందని, అనంతరం అధికారులు భూమి ఆక్రమించిన వ్యక్తికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయితే ఇప్పటికీ ఆ భూమిని పూర్తిగా స్వాధీనం చేసుకుని కంచె లేదా కందకం వేయకపోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కామన్‌పల్లి గ్రామ శివారులో కడెం కాలువ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఆలయాన్ని పూర్తిగా తొలగించకపోవడంపై అధికారులు స్పందించాలని, సైలన్ బాబా అశోక్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సుమోటో కేసు నమోదు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## తైక్వాండో పోటీల్లో దామరచర్ల విద్యార్థులకు పతకాలు



**వేద న్యూస్, దామరచర్ల:**

నాలుగవ ఉమ్మడి నల్గొండ జిల్లా తైక్వాండో ఛాంపియన్‌షిప్-2026లో దామరచర్ల మండలానికి చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. దామరచర్లకు చెందిన అరవింద స్కూల్, శాంతినికేతన్ హై స్కూల్ విద్యార్థుల్లో గోలి దేవేంద్రనాథ్ గోల్డ్ మెడల్ సాధించగా, సపావత్ సాయి కిరణ్, ధరావత్ యశ్వంత్‌లు సిల్వర్ మెడల్స్ గెలుచుకున్నారు. అలాగే దండగల మైత్రి, తంబళ్ళ పృథ్వీరాజ్, అజ్మీర రాము, అజ్మీర అభిషేక్, లావూరి తనూష్, మాలోత్ దేవేందర్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ విద్యార్థులంతా జీఆర్ టైక్వాండో అకాడమీలో మాస్టర్ గోలి రమేష్ వద్ద శిక్షణ పొందినవారు. ఈ సందర్భంగా శాంతినికేతన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ లిమా మేరీ, అరవింద స్కూల్ కరస్పాండెంట్ బాబా నసీరుద్దీన్, ప్రిన్సిపాల్ లతీఫా బేగం విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 10, 2026

# అండర్‌పాస్ నిర్మించి సమస్యను పరిష్కరించాలి

- జాతీయ రహదారి నిర్మాణంతో ఇబ్బందులు
- నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



**వేద న్యూస్, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు, గొల్లపల్లి గ్రామాల మీదుగా కరీంనగర్-వరంగల్ మధ్య నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ రహదారి నిర్మాణం కారణంగా వ్యవసాయ పొలాలు, స్మశాన వాటిక, ఇతర అవసరాలకు వెళ్లాలంటే చాలా దూరం ప్రయాణించాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను నిరసిస్తూ సోమవారం రెండు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ, జాతీయ రహదారి నిర్మాణంతో రోడ్డు చాలా ఎత్తుగా ఉండగా, గ్రామాలు, ఇళ్లు, గ్రామపంచాయతీ కార్యాలయం లోతట్టు ప్రాంతాల్లోకి వెళ్లిపోయాయని తెలిపారు. దీని వల్ల రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కావున వెంటనే అండర్‌పాస్ నిర్మించి రెండు గ్రామాల ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రెండు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి బియ్యం వితరణ

**వేద న్యూస్, కమలాపూర్:**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన ఎల్కటి సదానందం ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, ఆ కుటుంబాన్ని మాజీ ఎంపీటీసీ మాట్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఈ సందర్భంగా తన వంతు సాయంగా 50 కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కమలాపూర్‌లో పేదలు, నిరుపేదలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని తెలిసిన వెంటనే స్పందించి సహాయం అందించే సేవా దృక్పథంతో మాట్ల వెంకటేశ్వర్లు ముందుకు వస్తున్నారని స్థానికులు తెలిపారు. తమ ఆపదలో అండగా నిలిచినందుకు ఆయనకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తక్కళ్లపల్లి సత్యనారాయణరావు, వార్డు మెంబర్ పుల్ల శ్రీనివాస్, మాట్ల శ్రీధర్, దుర్వేశ్, మహేష్, సారంగపాణి, చంద్రమొగిలి, బక్కయ్య, పోచయ్య, వీరస్వామి, కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ ప్రభుత్వ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టులకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కమలాపూర్ గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా నిర్వహించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా పూర్తి వివరాలతో, వివిధ పద్ధతుల్లో సమస్యల పరిష్కారాలను ఈ స్టడీ మెటీరియల్‌లో పొందుపరిచినట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలనే లక్ష్యంతో, విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చక్కటి విశ్లేషణతో ఈ మెటీరియల్‌ను రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ యూనియన్ ప్రస్తుత అధ్యక్షుడు గాజుల సతీష్, మాజీ అధ్యక్షుడు బాలసాని దేవేందర్, ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, దినపత్రిక సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వారాంతపు సంతల్లో సమస్యల తిష్ట..!

- రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, పండ్ల విక్రయాలు
- మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



**వేద న్యూస్, నల్లబెల్లి :**



నల్లబెల్లి మండల కేంద్రంలో వారం అంగడి వాహనదారులకు తలనొప్పి తెచ్చిపెడుతోంది. సంతా మా ఊరి సంతా.. వారానికోసారి జోరుగా సాగేటి సంతా మా ఊరి సంత.. అన్నట్లుగా గ్రామీణ ప్రాంతాల్లో వారాంతపు సంతలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఎక్కడ సంత ఉంటే అక్కడ నిత్యావసరాలు, వస్తువులు విక్రయిస్తూ ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు. ప్రజలకు కూడా దూరభారంతో పాటు వ్యయప్రయాసలు తగ్గుతుండటంతో ఇక్కడే కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా సంతలు జనంతో కిక్కిరిస్తున్నాయి. మెయిన్ రోడ్డు మీదనే సంత ఏర్పాటు చేయడంతో రోడ్లకు ఇరువైపులా ఉన్న దుకాణాల వద్ద జనం గుంపులు గుంపులుగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.. మండల కేంద్రంలో ప్రతి సోమవారం జరుగు సంతకు అనాది కాలం నుండి నిత్యావసర వస్తువులు, కూరగాయలు చిరు వ్యాపారులు, రైతులు తీసుకొని వచ్చి సంతలో అమ్ముకొని వెళతారు. సంత వచ్చిందంటే నల్లబెల్లి గ్రామ ప్రజలే గాక ఇతర ప్రాంతాల వారు వచ్చి సరుకులు కొని తీసుకుని వెళతారు. భారీ వాహనాలు నిత్యం ప్రయనిస్తూనే ఉంటాయి ప్రతి సోమవారం రోడ్డుకిరువైపులా అంగడిని నిర్వహిస్తుండడం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదని తల బాదుకుంటున్నారు. సోమవారం వచ్చింది అంటే చాలు ఇక వాహనదారులకు చుక్కలే.రోడ్లపై గుంపులు గుంపులుగా జనాలు చేరి కొనుగోళ్లు చేస్తుండటంతో మార్కెట్ అంతా సందడిగా మారి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతోంది.వచ్చి పోయే వాహనాలకు అడ్డుగా వస్తుండటం తో ప్రమాదాలు జరిగే అవకాశం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంది.వాహనదారులకు దారి వదిలి సంతను ఏర్పాటు చేసుకోవాలని లేదా మార్కెట్ ను మరో చోటుకు మార్చాలని వాహనదారులు కోరుతున్నారు.

**ఆదాయమున్నా..**

నల్లబెల్లి సంతలో వ్యాపారం నిర్వహించినందుకు గాను పన్నులు వసూలు చేస్తారు. దీంతో గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరుతింది.కానీ పంచాయతీ అధికారులు సంతలో ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదు.ఇక్కడ కూరగాయలు, పండ్లు, చేపలు ఇతర వస్తువులు అమ్ముకునేందుకు స్థలం లేని కారణంగా రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు కూర్చుని అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.అక్కడక్కడ ఆదాయం వస్తున్న వారాంతపు సంతలోను అభివృద్ధి చేస్తున్న ఇక్కడ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి.ఆయా సంతలు ఆ సౌకర్యాల మధ్య కొనసాగుతున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.ఇప్పటికైనా స్పందించి వారాసంతపు సంతల్లో కలిసివస్తులు కల్పించాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా వ్యాపారులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ముఖ్యంగా వీధి దీపాలు మరుగుదొడ్లు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని ఇలా చేయడం వల్ల గ్రామ పంచాయతీకి కూడా లాభం వస్తుందని  శాశ్వతంగా నిధులు సమకూర్తాయని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కొండాపురం నుంచి కబడ్డీ గర్జన

- సీఎం కప్‌లో సంజనకు డివిజన్ టాప్ విజయం



**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి మండలం కొండాపురం గ్రామానికి చెందిన కొల్లూరి సంజన క్రీడారంగంలో సరికొత్త వెలుగులు నింపింది. నర్సంపేట మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఆమె, ముఖ్యమంత్రి కప్ కబడ్డీ పోటీల్లో పాల్గొని నర్సంపేట డివిజన్ స్థాయిలో తొలి స్థానం సాధించింది.గత రెండు సంవత్సరాలుగా నిరంతర సాధనతో తన ప్రతిభను మెరుగుపర్చుకున్న సంజన, పోటీల్లో అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. ఆమె విజయంతో గ్రామమంతా ఆనందోత్సాహాలతో నిండిపోయింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రముఖులు సంజనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. పేద కుటుంబానికి చెందినప్పటికీ కష్టపడి ఎదిగి ఈ స్థాయికి చేరుకోవడం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలిచింది. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోనూ సంజన ప్రతిభ చాటాలని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు

# అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి




**వేద న్యూస్, నల్లబెల్లి :**

భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పొనగండ్ల గ్రామం లో ఎనిమిది సంవత్సరాల బాలికపై అత్యాచారం చేసిన నిందితులను గుర్తించి పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని స్థానిక తహసీల్దార్ ముప్పు కృష్ణకు తెలంగాణ దళిత విద్యావంతుల ఐక్యవేదిక వరంగల్ జిల్లా కార్యదర్శి గట్టు సాంబయ్య ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేసియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ప్రభుత్వం ఇవ్వాలన్నారు. బాలికకు వైద్యానికి అయ్యే ఖర్చులు మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. తక్షణమే అత్యాచార సంఘటనపై సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని దోషులను కఠినాతి కఠినంగా శిక్షించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పరికిరత్నం,యువ నాయకులు ప్రకాష్, మేర సంఘం మండల కార్యదర్శి ఓదెల రవి, జితేందర్, ప్రకాష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూం ఇళ్లు త్వరగ పూర్తి చేయాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో హౌసింగ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పీఆర్ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వేములవాడ, కొండాపూర్, మద్దికుంట, బద్దెనపల్లి, తంగళ్ళపల్లిలో కొనసాగుతున్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలపై సమీక్షించి, ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా ఇండ్ల నిర్మాణాలను గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ డీఈ సాజిద్, ఆర్ అండ్ బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మరిపెడలో గడపగడపకూ గులాబీ దండు



**వేద న్యూస్, మరిపెడ:**

మున్సిపల్ ఎన్నికల చివరి రోజు ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి బాదావత్ బేబిశ్రీ రవి నాయక్ కారు గుర్తుకు మీ విలువైన ఓటు వేసి గెలిపించాలని కోరుతూ గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా యువ నాయకుడు రవిచంద్ర గారితో కలిసి మరిపెడ 10వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం సాగించారు. ఈ ప్రచారంలో 10, 11వ వార్డుల మాజీ కౌన్సిలర్లు ఎడెల్లి పరశురాములు, హతిరామ్, మరిపెడ యూత్ నాయకులు, మహిళలు భారీ ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గుంతలో పడ్డ స్కూల్ వ్యాన్



- విద్యార్థులకు తప్పిన ముప్పు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ పట్టణంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులను తీసుకెళ్తున్న వ్యాన్ ప్రమాదవశాత్తు రోడ్డుపై ఉన్న వాటర్ గేటు వాల్ గుంతలో పడిపోయింది. అయితే వ్యాన్‌లో ఉన్న విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. తెలంగాణ చౌరస్తా నుంచి కోరుట్ల బస్టాండ్ వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనుల సమయంలో కాంట్రాక్టర్లు గుంత వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు, భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 10, 2026

# 'రూ.100 కోట్ల ఒప్పందం' ఆరోపణలపై కాంగ్రెస్ ఫైర్

- విచారణ జరిపి నిజాలు తేల్చాలి
- నిరాధారమైతే బండి సంజయ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హస్తం నేతలు




**వేద న్యూస్, కరీంనగర్:**

కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల మధ్య రూ.100 కోట్ల ఒప్పందం కుదిరిందంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకత్వం తీవ్రంగా స్పందించింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పేర్కొంటూ, సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులు కలిసి కరీంనగర్ 1వ థాణా సీఐకు ఫిర్యాదు అందజేశారు. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి నిజాలు తేల్చాలని వారు డిమాండ్ చేశారు. విచారణలో ఆరోపణలు అసత్యమని తేలితే, వ్యాఖ్యలు చేసిన వారు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేయడం తగదని విమర్శించారు. ఈ వ్యవహారం కరీంనగర్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# లక్ష్మీ దేవమ్మ ఆలయానికి విద్యుత్ వెలుగు

- అధికారుల తక్షణ స్పందనకు గ్రామస్థుల హర్షం

**వేద న్యూస్, నల్లబెల్లి :**



మేడపల్లి గ్రామంలోని ఊర చెరువు సమీపంలో ఉన్న లక్ష్మీ దేవమ్మ (సత్తియాడి) ఆలయానికి విద్యుత్ సదుపాయం కల్పించేందుకు అధికారులు వెంటనే స్పందించారు. కరెంట్ ఎడి, డీఈ స్వయంగా ఆలయాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఆలయానికి విద్యుత్ లైన్ ఏర్పాటు విషయంలో సానుకూల నిర్ణయం తీసుకున్నారు. దీంతో భక్తులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నాళ్లుగానో ఉన్న సమస్యకు పరిష్కారం దిశగా అడుగు పడిందని తెలిపారు. ప్రభుత్వ అధికారుల స్పందన అభినందనీయమని గ్రామ పెద్దలు ప్రశంసించారు.

# 44 సార్లు రక్తదానం

- ప్రభుత్వ ఉపాధ్యాయుడి సేవాభావం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన ముస్కు ప్రసూన్ కుమార్ వృత్తిరీత్యా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు. వృత్తిలో చేరిన నాటి నుంచి సేవా భావంతో నిరంతరం రక్తదానం చేస్తూ పలువురికి ప్రాణదానం చేస్తున్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్తాన్ని దానం చేశారు. ఇప్పటివరకు ప్రసూన్ కుమార్ 44 సార్లు రక్తం దానం చేసి అనేక మంది ప్రాణాలను కాపా డారు. రక్తం అవసరం ఉన్నవారికి సమాచారం అంద ^గానే వెంటనే స్పందించి సహాయం అందించడం ద్వారా ఆయన పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు..

# కరీంనగర్‌లో బీజేపీ ఏకపక్ష విజయం ఖాయం

- 66 డివిజన్లలో 45 స్థానాలు గెలుస్తాం
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్




**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు పూర్తిగా ఏకపక్షంగా మారాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మొత్తం 66 డివిజన్లలో బీజేపీ 45 స్థానాలు గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మేయర్ పీఠం బీజేపీకి దక్కితే కరీంనగర్ ప్రజలకు రక్షణ కవచంగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ప్రచార చివరి రోజు తీగలగుట్టపల్లి, చింతకుంట ప్రాంతాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల ఆలస్యానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కేంద్రం నుంచి రూ.154 కోట్ల నిధులు మంజూరు చేయించానని, రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేసిందన్నారు. అమృత్ 2.0 పథకం కింద రూ.132 కోట్లతో తాగునీటి పనులు కొనసాగుతున్నాయని, ఈ నిధులు పూర్తిగా తానే తీసుకొచ్చినవని తెలిపారు. పద్మానగర్ పార్కు పనులు నిర్లక్ష్యంతో నిలిచిపోయాయని, బీజేపీ మేయర్ గెలిచిన వెంటనే వాటిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్ అభివృద్ధి కొనసాగాలంటే బీజేపీకి ఓటు వేయాలని, డబ్బులకు లొంగకుండా ప్రజలు చైతన్యంతో నిర్ణయం తీసుకోవాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ నేతల జోరు ప్రచారం

- జమ్మికుంట గాంధీ చౌక్ లో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన



**వేద న్యూస్, జమ్మికుంట:**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు సోమవారం కాంగ్రెస్ నేతలు జోరుగా ప్రచారం నిర్వహించారు. జమ్మికుంట పట్టణ పరిధిలోని గాంధీ చౌరస్తాలో మంత్రి శ్రీధర్ బాబు, హుజరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి ప్రణవ్ , జమ్మికుంట కాంగ్రెస్ ఎన్నికల ఇన్ చార్జి సిఎన్ రెడ్డి తదితరులు హాజరై ప్రచారం నిర్వహించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పథకాలను తీసుకొచ్చిందని వివరించారు. జమ్మికుంట పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో పాటు ప్రజా శ్రేయస్సు అధ్యయంగా పనిచేస్తున్నదని చెప్పారు. అభివృద్ధికి అండగా నిలవాలని కోరారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ 28వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఒగ్గు రమేష్ తో పాటు పలువురు కౌన్సిలర్ అభ్యర్థులు నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం

- సింహం గుర్తుకు ఓటేయాలి
- ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ నగరంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి ప్రజలను సింహం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కనీసం 26 స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. అలాగే బీజేపీ-బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు జరిగిన అభివృద్ధిని వివరించాలని, బీజేపీ నేతలు నగరానికి తీసుకొచ్చిన నిధులపై ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ సిటీ పేరుతో గత ప్రభుత్వ హయాంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. అనంతరం ఏఐఎఫ్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 10 మున్సిపాలిటీలు, రెండు కార్పొరేషన్లలో మొత్తం 132 స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని తెలిపారు. ప్రజలు అవినీతి పార్టీలను తిరస్కరించి సింహం గుర్తుకు ఓటు వేసి ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- సైలెన్స్ పీరియడ్‌లో ప్రచారం నిషేధం
- సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలు
- జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు




**వేద న్యూస్, మెదక్:**

మెదక్ జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం సాయంత్రం 5 గంటలతో ఎన్నికల ప్రచారం ముగుస్తుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ సమయంలో బహిరం గ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారం, మైకులు, లౌడ్ స్పీకర్లు, ప్రచార వాహనాలు, పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు తదితర ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాగే సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా ఎలాంటి ప్రచారం నిషేధమని తెలిపారు. సైలెన్స్ పీరియడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ రోజున ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా జిల్లా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టిందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను మోహరించినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఎన్నికల నిబంధనలను గౌరవించి పోలీస్ శాఖకు సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్సీ కొమురయ్యకు అస్వస్థత

- ఆసుపత్రికి తరలింపు
- నిలకడగానే ఆరోగ్యం



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అస్వస్థతకు గురయ్యారు. సోమవారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని చింతకుంటలో జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రచార రథంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తో కలిసి ఉండగా, బండి సంజయ్ ప్రసంగిస్తున్న సమయంలో కొమురయ్యకు అకస్మాత్తుగా తల తిరగడంతో కింద పడిపోయారు. తక్షణమే అప్రమత్తమైన పార్టీ నేతలు ఆయనను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. గత వారం రోజులుగా నిర్విరామంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం, విశ్రాంతి లేకపోవడం వల్లే ఆయన స్వల్ప అస్వస్థతకు గురైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వివరించారు.

# మహాశివరాత్రి జాతరకు ఆహ్వానం



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈవో రమాదేవి రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హరీశ్‌కు సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. హైదరాబాద్‌లోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయంలో ఆలయ అర్చకులు, వేద పండితులతో కలిసి కమిషనర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వేద న్యూస్

మంగళవారం ఫిబ్రవరి 10, 2026

# సిద్దిపేటలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- మద్యం సేవించి వాహనాలు నడిపిన 11 మందికి జరిమానా
- డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి రూ.5,000 ఫైన్



**వేద న్యూస్, సిద్దిపేట:**

సిద్ధిపేట పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 11 మందికి కోర్టు రూ.1,12,500 జరిమానా విధించింది. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన మరో వ్యక్తికి రూ.5,000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ తెలిపారు. మొత్తం జరిమానా రూ.1,17,500గా నిర్ణయించబడింది. సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు చేయగా 11 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు నిర్ధారణ అయ్యింది. వారిని శుక్రవారం సిద్ధిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా, విచారణ అనంతరం జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారులకే కాకుండా రోడ్డుపై ప్రయాణించే ఇతరులకు కూడా ప్రమాదం జరుగుతుందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడితే కోర్టు రూ.10వేల వరకు జరిమానా విధిస్తుందని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే రూ.5వేలు జరిమానా తప్పదని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తోనే వాహనాలు నడపాలని ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు సూచించారు.

# గంప అశోక్ కుమార్ సేవలు అభినందనీయం



- ప్రధానోపాధ్యాయులు వీర ఉపేందర్

**వేద న్యూస్, వరంగల్:**

ప్రభుత్వ ఉన్నత పాఠశాల కృష్ణకాలనీలో ప్రధానో పాధ్యాయుడిగా, వరంగల్ ఎంఈఓగా సమర్థవంతంగా విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన గంప అశోక్ కుమార్ సేవలు అభినందనీయమని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీర ఉపేందర్ కొనియాడారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గంప అశోక్ కుమార్ ఉపాధ్యాయులు, 415 మంది విద్యార్థులకు రూ.26 వేల విలువైన ఐడీ కార్డులు, వాటర్ డిస్పెన్సర్ ఫ్రిడ్జ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వీర ఉపేందర్ మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధిలో గంప అశోక్ కుమార్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. అనంతరం గంప అశోక్ కుమార్ మాట్లాడుతూ, పాఠశాలపై తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆదర్శంగా సేవలందిస్తున్నారని ప్రశంసించారు. ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో పాఠశాలను అగ్రస్థానంలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చొప్పదండి మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మున్సిపాలిటీకి అత్యధిక నిధులు తీసుకువచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. చొప్పదండిలో మినీ స్టేడియం నిర్మాణం, కుడి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గుమ్లాపూర్‌లో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి సభలో చొప్పదండి అభివృద్ధికి అవసరమైన పనుల జాబితాను ముఖ్యమంత్రికి అందజేశానని, అభివృద్ధికి సీఎం నుంచి హామీ లభించిందని తెలిపారు. ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

# రేవంత్ తెలంగాణకు శనిలా దాపురించాడు

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి
- బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్



**వేద న్యూస్, చొప్పదండి:**

సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణకు శనిలా మారారని మాజీ ఎంపీ బోయిన్పల్లి వినోద్ కుమార్ ఆరోపించారు. చొప్పదండి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కటైనా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. ఆసరా పెన్షన్లు, రైతుబంధు, కళ్యాణలక్ష్మి, ఉద్యోగాల హామీలతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో యూరియా ఇంటికే వచ్చేదని, ప్రస్తుతం రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చొప్పదండిలో డిగ్రీ కళాశాల, మున్సిపాలిటీ అప్‌గ్రేడేషన్, సెంట్రల్ లైటింగ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, 100 పడకల ఆసుపత్రి వంటి పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించామని, వాటిని పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలుకు భయపడుతుందని వ్యాఖ్యానించారు. ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు.

# అన్నీ తానై..‘బండి‘ ముందుకు..

- కార్యకర్తల గెలుపే లక్ష్యంగా కేంద్రమంత్రి కృషి
- సంజయ్ కుమార్ సారధ్యంలో కమల వికాసం
- మున్సిపల్ ఎన్నికలలో సత్తా చాటుతామని కమలనాథుల ధీమా

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**




మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. ప్రధాన రాజకీయ పార్టీల ప్రచార సరళి, ఎన్నికల ఎజెండా, అభ్యర్థుల గెలుపు కోసం వేసే ఎత్తుగడలు వంటి అంశాలను పరిశీలిస్తే....అన్నింట్లోనూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అగ్రభాగాన నిలిచారు. ఈ ఎన్నికల్లో బండి సంజయ్ ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావిస్తూ.. ప్రజల్లో ఆలోచన రేకెత్తిస్తూ వారిని ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. మొదటిది అభి వృద్ధి నినాదం... రెండోది ఆధ్యాత్మికం కాగా, మూడో అంశం ఆదర్శవంతమైన పాలన.

**పోల్ మేనేజ్మెంట్**

కరీంనగర్ కార్పొరేషన్ సహా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలన్నింటిలోనూ భారతీయ జనతా పార్టీ ప్రచారంలోనూ ముందంజలో ఉంది. ముఖ్యంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నీ తానై ప్రచారంతోపాటు అభ్యర్థుల గెలుపు బాధ్యతలను పూర్తిగా తన భుజాన వేసుకుని పనిచేశారు. ఒకవైపు ప్రచారం..మరోవైపు పార్టీ కార్యక్రమాలు...ఇంకోవైపు పోల్ మేనేజ్ మెంట్ సహా అన్నీ పనులు ఒంటి చేత్తో నిర్వర్తిస్తూ... ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పెద్దగా కష్టం లేకుండా చేయడంలోనూ బండి సంజయ్ అగ్రభాగాన నిలిచారు.

అభివృద్ధి నినాదం

ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ ఈసారి విభిన్న రీతిలో ప్రచారం నిర్వహించారు. హిందుత్వ నినాదాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తారని ప్రత్యర్థ పార్టీలు భావించారు. జరిగిన అభివృద్ధి పనులను ప్రతి మీటింగ్ లోనూ వివరిస్తూ బండి సంజయ్ మాటలకే పరిమితం కాలేదు... చేతల్లో చూపుతున్న అభివృద్ధి కాముకుడు అనే భావనను ప్రజలకు కలిగించడంలో సక్సెస్ అయ్యారు.

**ఆధ్యాత్మిక అంశాల జోడింపు**

ఇకో రెండో విషయాన్ని బండి సంజయ్ లో స్వతహాగా దైవ భక్తి, అధ్యాత్మిక చింతన ఎక్కువ. ప్రజల్లో అధ్యాత్మిక చింతన పెంపొందించాలనే ఉద్దేశంతో ఎన్నికల ప్రచారంలో ప్రతి కాలనీ, డివిజన్ లో ఎక్కడ ఆలయాలు అభివృద్ధికి నోచుకోలేదో...వాటిని అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చారు. అదే సమయంలో ప్రజలు ఎక్కడ ఆలయం కావాలని కోరితే... అక్కడ నూతన ఆలయాలను నిర్మిస్తానని కూడా హామీ ఇవ్వడం గమనార్హం. ఇక మూడో విషయానికొస్తే కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ తోపాటు ఆయా మున్సిపాలిటీల్లో ఛైర్మన్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే.... ఆదర్శవంతమైన పాలన అందించే బాధ్యత తీసుకుంటానంటూ భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు.

**విస్తృత ప్రచారం**

మొత్తంగా బండి సంజయ్ ఎంచుకున్న ఈ మూడు అంశాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాయి. సంజయ్ ఎక్కడ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించినా తండోపతండాలుగా తరలివచ్చారు. మండు టెండలోనూ ఓపికగా సంజయ్ ప్రసంగాలను ఆసక్తితో వింటూ...చప్పట్లతో తమ ఆనందాన్ని వ్యక్తం చేయడం విశేషం. మరోవైపు సంజయ్ ప్రచార సరళి, ఎన్నికల ఎత్తుగడ దెబ్బకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయాయి. అటు ప్రచార సరళిలో, ఇటు ఎన్నికల ఎత్తుగడలో పూర్తిగా వెనుకబడిపోయారు. ప్రధాన పార్టీల ముఖ్య నేతలు సైతం ఏం చేయాలో తెలియక నిశ్చేష్టులైపోవడం గమనార్హం.

# ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



**వేద న్యూస్, మడికొండ:**

ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్ ఘటన మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆవుల ప్రణయ్ కుమార్ (24) సోమవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం, ప్రణయ్ కుమార్ అదే గ్రామానికి చెందిన ఓ యువతితో గత కొంతకాలంగా పరిచయం ఉండేదని, ఈ విషయం యువతి కుటుంబ సభ్యులకు తెలిసిన అనంతరం ఆమెను నల్గొండలోని బంధువుల ఇంటికి పంపినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జరిగిన పరిణామాలతో యువకుడు తీవ్ర మనస్తాపానికి గురైనట్టు సమాచారం. ఉదయం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి, చుట్టుపక్కల వారిని పిలిచారని, అప్పటికే యువకుడు మృతి చెందినట్లు తెలిసిందన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు మడికొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# డబుల్ బెడ్‌రూమ్ పేరుతో డబ్బులు వసూలు చేశారు



- కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వండి
- కేకే మహేందర్ రెడ్డి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

గత పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసినా సిరిసిల్ల 24వ వార్డు కనీస అభివృద్ధికి కూడా నోచుకోలేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి విమర్శించారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి ఆడెపు వెంకటస్వామి తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డులో సీసీ రోడ్లు, మురుగు కాలువలు లేవని, వర్షం పడితే ఇళ్లలోకి నీరు చేరుతోందని తెలిపారు. తాగునీటి సరఫరా కూడా సక్రమంగా లేదన్నారు. గత బీఆర్ఎస్ కౌన్సిలర్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్ జోన్ సమస్య పరిష్కరించి ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ అందేలా చర్యలు చేపడతామని, వార్డు అభివృద్ధి బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని, ఆడెపు వెంకటస్వామిని గెలిపించాలని ప్రజలను కోరారు.

# కొబ్బరిచెట్టు పై నుంచి పడి వ్యక్తి మృతి



**వేద న్యూస్ హైదరాబాద్ :** ప్రమాదవశాత్తు కొబ్బరి చెట్టు నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గౌతంనగర్‌కు చెందిన శీలం బాలయేసు(33) కూలి పనులు చేస్తుంటారు. పనుల నిమిత్తం గౌతంనగర్‌లో కొబ్బరి చెట్టు కొట్టడం కోసం స్నేహితుడితో కలిసి వెళ్లాడు. పనులు చేస్తుండగా సాయంత్రం చెట్టు పైనుంచి పడిపోయినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, గాంధీ దవాఖానకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు తెలిసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073